## క్లుప్తంగా...

### కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.75, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 90, బజ్జీమిర్చి 95, క్యాప్సికమ్ 95, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 50, దొండ 18, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 15, దోసకాయ 23, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 28, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

### సికింద్రాబాద్ డీసీగా సుధాంశ్



సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్.సుధాంశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి డిప్యూటీ కమిషనర్ టీ.దశరథ్ ఎల్‌బీనగర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. చందానగర్ నుంచి బదిలీపై సుధాంశ్ సికింద్రాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 సంవత్సరానికి అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం ఓ ప్రకటనలో తెలిపారు. గణితశాస్త్రం, సంస్కృత భాషల బోధనలకు ఒక్కొక్కరు, కంప్యూటర్ సైన్స్ కోసం ఇద్దరిని నియామనం చేయనున్నట్లు ఆయన తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం ఉత్తీర్ణత) ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పీజీతో పాటు ఎన్ఈటీ/ఎస్ఎల్ఈటీ/ఎస్ఈటీ/పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని ఈ నెల 25న ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

### వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



ఫలహార బండి ఊరేగింపులో డా. రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: బల్కంపేటలో న్యాయవాది మధు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు వైభవంగా జరిగింది. డప్పు చప్పుళ్లు, మేళ తాళాలు, డ్యాన్స్‌లతో ఊరేగింపు ఉత్సాహంగా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఫలహార బండి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్‌ను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆకుల రాంచందర్, షాబాద్ సత్యనారాయణ పాల్గొన్నారు.

### సీతక్కను కలిసిన ఓయూ విద్యార్థులు



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు హైకోర్టు న్యాయవాదుల సంఘం సీనియర్ కార్యవర్గ సభ్యులు నాగులూరి కృష్ణ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ములుగు ఎమ్మెల్యే సీతక్కను ఆమె నివాసంలో కలిశారు. అధిక ఫీజుల పెంపు, హాస్టల్ సమస్యలు, సెలబస్ పూర్తి కాకుండానే పరీక్షల నిర్వహణతో పెరుగుతున్న ఒత్తిడి, విద్యార్థులు చేస్తున్న ఉద్యమాలను సీతక్కకు వివరించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఓయూ అధికారులు పట్టించుకోవడం లేదని ఓయూలో పర్యటించి వాస్తవ పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీతక్కను కోరారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు



అమీర్‌పేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని బేగంపేట టీటీఐ ఏసీపీ టి.శంకర్‌రాజు అన్నారు. ఎస్‌ఆర్‌నగర్ రాయల్ కళాశాలలో బుధవారం మోటారు వాహన చట్టం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ఇన్సూరెన్సుపై అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రెడ్ సిగ్నల్ పడ్డాక వాహనాలు ఆపకుండా వెళ్తే ఎక్కువ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితిలో వాహనాలు ఇవ్వరాదని కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. ఇన్‌స్పెక్టర్ సురేష్, టీటీఐ ఎస్సై జ్యోతి పాల్గొన్నారు.

# శిథిలం.. ఉద్యోగుల్లో భయం భయం



- శిథిలావస్థలో బేగంపేట ఆర్ అండ్ బీ క్వార్టర్స్
- చిట్టడవిని తలపిస్తోన్న క్వార్టర్స్ పరిసరాలు
- సగానికి పైగా ఖాళీ, కొత్తగా చేరేందుకు జంకుతున్న ఉద్యోగులు

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్ నిర్వహణ అధ్వాన్నంగా మారింది. అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థ, వెలగని వీధిదీపాలు, విషసర్పాల సంచారం.. క్వార్టర్స్ చుట్టూ అడవులను తలపించే రీతిలో చెట్ల పొదలతో అడవిని తలపిస్తోంది. వర్షం పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారి భయానక వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు బేగంపేట్ పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌లో ఉద్యోగులు.

**నిర్వహణ లోపం కారణంగా..**

వివిధ శాఖల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల ఆవాసం కోసం గత 50 ఏళ్ల క్రితం బేగంపేట్ పాటిగడ్డలో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించింది. మొదటి విడతగా 252 క్వార్టర్స్, పదేళ్ల తర్వాత రెండో విడతగా మరో 252 క్వార్టర్స్ నిర్మాణం చేశారు. అధికారుల కేటగిరీల వారీగా ఏ, బీ, సీ, డీ టైపు క్వార్టర్స్ నిర్మాణం జరిగింది. సచివాలయం నుంచి వచ్చే ఆర్డర్స్ మేరకు ఉద్యోగులకు ఇక్కడ కేటాయింపులు జరుపుతారు. వారి వేతనాలను బట్టి హెచ్‌ఆర్‌ఏ కోత విధిస్తారు. ఆర్ అండ్ బీకి చెందిన స్థలంలో నిర్మాణాలు జరిపిన నేపథ్యంలో ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌గా పిలుస్తూ వచ్చారు. వీటి నిర్వహణనూ ఆర్ అండ్ బీకే అప్పగించారు. క్వార్టర్స్‌కు సంబంధించి ఏదైనా పనులు చేయాలంటే ఉద్యోగులు ముందుగా అప్పీలు పెట్టుకుంటారు. ఆ మేరకు అంచనాలు తయారుచేసి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అప్పీలు తాలుకూ పనులు ఎప్పుడు చేస్తారో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఉద్యోగులే గత్యంతరం లేక పనులు చేయించుకుంటున్నారు.

**భయంతో ఖాళీ చేస్తున్నారు..**



చిట్టడివిని తలపించేలా..

ఇక్కడ నిర్వహణ సరిగా లేక భయంతో చాలా మంది ఉద్యోగులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ముఖ్యంగా పాత క్వార్టర్స్ స్లాబ్ పెచ్చులు కూడా ఊడిపోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను అలాగే వదిలేయడంతో గుబురుగా చెట్లు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. ఇదే ఆసరాగా చేసుకుని పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పచ్చిమొక్కలు, చెట్ల పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో పాముల సంచారం ఎక్కువైంది. వర్షం పడితే చిత్తడిగా మారిన రోడ్లపై ప్రయాణం నరకకూపంగా మారింది. ఆర్ అండ్ బీ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మించుకున్న ఇళ్లకు అసలు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏకంగా రోడ్ల మీదకే వదులుతున్నారు. దీంతో రోడ్లపై మురుగు నీరు ప్రవహించడం నిత్యకృత్యమే. క్వార్టర్స్‌లో సైతం ఎప్పుడో 50 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్లే ఉండడంతో ఇళ్ల నివాసితులకు ఎప్పుడూ డ్రైనేజీ జాం అయ్యి ముప్పుతిప్పలు పెడుతోంది. మురికి కూపంలోనే సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇక్కడి క్వార్టర్స్‌ను చూస్తే అసలు నగరంలో ఉన్నామా.. లేక అడవిలో ఉన్నామా? అనే అనుమానం వస్తుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో ఆర్ అండ్ బీ క్వార్టర్స్

## బేగంపేట ముంపు సమస్యను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్‌దే

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



బ్రాహ్మణవాడీలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: బేగంపేట నివాసితులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని కట్టెలమండిలో రూ.8.50 లక్షలు, బ్రాహ్మణవాడీలో రూ.13 లక్షలతో చేపట్టనున్న సీవరేజీ పైప్‌లైన్ పనులను మంత్రి ప్రారంభించారు. వికార్‌నగర్‌లో పర్యటించిన ఆయనకు స్థానికులు పలు సమస్యలను విన్నవించగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బ్రాహ్మణవాడీలో అన్ని లైన్‌లలో సీవరేజీ పనులు చేపడుతున్నామని ఇవి పూర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాల నుంచి ఈ ప్రాంత ప్రజలు వరదనీటి ముంపుతో పడుతున్న ఇబ్బందులను మంత్రి కేటీఆర్ చొరవతో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం కింద రూ.45 కోట్ల వ్యయంతో బేగంపేట నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని త్వరలోనే పూర్తవుతాయన్నారు. నాలా వెంట ఉన్న కాలనీల్లో కూడా వర్షాకాలంలో నీరు నిలవకుండా సీవరేజీ లైన్ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్ల నిర్మిస్తామని ఈ పనులతో వరద ముంపు సమస్య నుంచి ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత విముక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, మేనేజర్ శశాంక్, శానిటరీ డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ సుధీర్ పాల్గొన్నారు.

## బీసీలందరికీ 'బీసీ బంధు' ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కంటోన్మెంట్: వెనుకబడిన కులాలు అన్నింటికీ బీసీ బంధు మంజూరు చేయాలని బీసీ శక్తి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నాగేశ్, రాష్ట్ర చైర్మన్ నాగుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం రసూల్‌పురాలోని కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ భవనం ఆవరణలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీసీ సంక్షేమానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, బీసీ భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కంటోన్మెంట్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో పోటీచేసే అభ్యర్థులు బీసీలకు ఏ విధమైన హామీలు ఇస్తారో ముందుగానే ప్రకటించాలన్నారు. బీసీ మంత్రిత్వ శాఖను కేంద్ర పరిధిలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ శంకర్ యాదవ్, సత్యనారాయణ గౌడ్, జగన్‌మోహన్ ముదిరాజ్, సురేందర్ రజక, వీరమణి, సుజాత, అరుణ్ యాదవ్, శ్రీరాములు యాదవ్, బత్తుల కృష్ణ, నగేశ్ యాదవ్, వినోద్, అశోక్, హరీష్ పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాన్ని అందరూ వినియోగించుకోవాలి



గన్‌బజార్ ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఈవో మధుకర్‌నాయక్, ఎమ్మెల్సీ బేగ్

రసూల్‌పురా: రసూల్‌పురా గన్‌బజార్ కస్తూర్బా పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం ప్రజలకు ఉపయోగపడేలా ఉన్నందున ప్రహరీ నిర్మాణం నిలిపివేయాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్, బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ను కోరారు. బుధవారం సీఈవో మధుకర్ నాయక్, ఎమ్మెల్సీ బేగ్, ఎంఐఎం కంటోన్మెంట్ ఇన్‌చార్జి ముఖ్రం ఖాద్రీ సదరు స్థలాన్ని పరిశీలించారు. ఎన్నో ఏళ్ల నుంచి గన్‌బజార్ పరిసర బస్తీల ప్రజలకు ఖాళీ స్థలం వివిధ శుభకార్యాలకు ఉపయోగపడుతుందని ప్రహరీ నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని బేగ్ సీఈవోకు తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. స్థలం కబ్జా కాకుండా ప్రహరీ నిర్మిస్తున్నామని స్థానికుల అభ్యర్థన మేరకు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని నిలిపివేస్తున్నామని.. భవిష్యత్ ప్రజలకు ఉపయోగపడే స్థలం కనుక కబ్జా చేస్తామంటే కుదరదన్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా స్థలాన్ని అందరు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోర్డు టౌన్ ప్లానింగ్ అధికారి బాలకృష్ణ, గన్‌బజార్ స్థానికులు, ఎంఐఎం నేతలు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో లాలాపేట ప్రాంతంలోని లోతట్టు, ఓపెన్ నాలా పరివాహక ప్రాంతాల్లో బుధవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, అధికారులతో కలిసి పర్యటించారు. లాలాపేట వినోభానగర్, సత్యానగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లోని ఓపెన్ నాలాలో వరద ఉధృతి, లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణ శాఖ అధికారుల ప్రకారం నగరంలో మరి కొన్ని రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాల వారు, ఓపెన్ నాలా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైనేజీ మూతలు తొలగించడం, బాక్స్ డ్రెయిన్ వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మిస్బా, నాయకులు శివశంకర్, వనజ, కారంపొడి పద్మ, ఖాజా, ఫయాజ్ పాల్గొన్నారు.

## సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలి



వర్షంలోనే రోడ్డుపై విద్యార్థుల బైఠాయింపు

లాలాపేట: సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలంటూ బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులంతా రోడ్డెక్కారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వందలాది మంది విద్యార్థులు లేడీస్ హాస్టల్ వద్ద దాదాపు 4 గంటల పాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓ వైపు సెలబస్ పూర్తి కాకుండానే ఆగస్టు 16న జరగాల్సిన పీజీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షలను ముందస్తుగా ఈ నెల 28 నుంచి పరీక్షలను ఏర్పాటు చేస్తే పరీక్షలు ఎలా రాస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఓయూ అధికారులు హడావుడిగా పరీక్షలు పెట్టి విద్యార్థులపై మానసిక ఒత్తిడికి కారణం అవుతున్నారని వాపోతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న వారిని అంబర్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై స్పందించిన ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థుల మేలుకోసమే విద్యా సంవత్సరం నష్టపోకుండా పరీక్షల షెడ్యూల్ ముందుగానే ప్రకటించామన్నారు. పరీక్షలు యథాతథంగా సాగుతాయని విద్యార్థులంతా హాజరు కావాలన్నారు.



ఓయూలో నిరసన తెలుపుతున్న కళాకారులు

## కళాకారులను ఆదుకోవాలి

లాలాపేట: రాష్ట్రం సాధించుకుని తొమ్మిదేళ్లు గడుస్తున్నా సరైన ఉపాధి లేక నిరుద్యోగులుగా మిగిలామని పలువురు కళాకారులు బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్ సాంస్కృతిక శాఖ ద్వారా తనకు నచ్చిన వారికే ఉద్యోగాలు ఇచ్చారని అందులో కళాకారులుగా అర్హత లేని వారు ఉన్నారని ఆరోపించారు. కళాకారుల పేరుతో కేవలం దాదాపుగా 500 మందికి ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. ఈ విషయమై ఇటీవల మంత్రి కేటీఆర్‌ను కలిస్తే ఇంకే ఉద్యోగాలంటూ తమను అవమానించారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ స్పందించి ఉద్యమ కాలంలోని కళాకారులందరికి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

## టీడీపీ డివిజన్ కమిటీల నియామకం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్లకు తెలుగుదేశం పార్టీ కమిటీలను బుధవారం నియమించినట్లు టీడీపీ సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ ప్రకటించారు. అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా ఇటెం చందర్ ముదిరాజ్, తార్నాక అధ్యక్షుడిగా గండికోట విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జీఎం రమేశ్, మెట్టుగూడ అధ్యక్షుడిగా వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏ.బాల మల్లేశ్‌యాదవ్, సీతాఫల్‌మండి అధ్యక్షుడిగా జీవీ కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, బౌద్ధనగర్ అధ్యక్షుడిగా గరిగె ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా కట్టెర శ్రీనివాస్‌ను నియమించినట్లు ఆయన వెల్లడించారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన రైల్వేపోలీసులు బుధవారం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. 2వ నెంబరు ప్లాట్‌ఫాం ఫుట్‌ఓవర్ వంతెన కింద అచేతనంగా పడిఉన్న వ్యక్తిని పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. సుమారు 60 ఏళ్ల వయసున్న వృద్ధుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతుడి ఒంటిపై కాషాయ రంగు లుంగీ, ఆరెంజ్ రంగు చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### వార్డు కార్యాలయంలో ప్రింటర్ చోరీ

చిలకలగూడ : సీతాఫల్‌మండి వార్డు కార్యాలయంలో ప్రింటర్ ఇతర పరికరాలు చోరీకి గురైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రుక్మిణి వివరాల ప్రకారం.. నామాలగుండు ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా కమ్యూనిటీహాల్లో ఇటీవల జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి తాళాలు పగులగొట్టిన దుండగులు సుమారు రూ. 50 వేల ప్రింటర్, యుపీఎస్, బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి కార్యాలయం ఇన్‌చార్జి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### జామకాయ తెంపేందుకు వెళ్లి మృత్యు ఒడికి..

అమీర్‌పేట: జామకాయ తెంపే ప్రయత్నంలో ఓ వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూలు సమీపంలోని తులసీనగర్‌లో గల ఓ అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో బి.శోభ-కృష్ణారెడ్డి (45) దంపతులు ఉంటున్నారు. బుధవారం కృష్ణారెడ్డి అపార్ట్‌మెంట్ ఆవరణలో ఉన్న చెట్టుకు జామకాయ తెంపేందుకు వెళ్లాడు. జామకాయ ఉన్న చెట్టు కొమ్మ మొదటి అంతస్తుకు దగ్గరగా ఉండడంతో తెంపుతుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రసూల్‌పురా: ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలకు గురైన మహిళ పొందుతూ మృతి చెందిన ఘటన తిరుమలగిరి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రవణ్‌కుమార్ వివరాల ప్రకారం.. పార్శిగుట్ట రాజీవ్‌నగర్‌కు చెందిన జి. వెంకటమ్మ, (50), జి. ఈశ్వరమ్మ (47), జి. ఈశ్వరమ్మ (55), భవిష్య (11 నెలలు) వీరంతా బాలాజీనగర్‌లోని తమ బంధువుల ఇంట్లో జరిగే బోనాల కోసం వెళ్లి ఈ నెల 18న ఓలా ఆటో (టీఎస్10యూఏ9621) రాజీవ్‌నగర్ పార్శిగుట్టకు వస్తున్నారు. తిరుమలగిరి నాగ దేవత ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన కారు (ఏపీ10ఏవై5560) ఆటోను ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడగా వెంకటమ్మ, ఈశ్వరమ్మ, భవిష్యకు గాయాలు కావడంతో సమీపంలో ఉన్న మిలటరీ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ వెంకటమ్మ మృతి చెందింది.

## మహిళాభ్యున్నతితోనే సమగ్ర అభివృద్ధి





షీ టాక్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్

కంటోన్మెంట్: మహిళలకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక అభివృద్ధి వేగవంతం అవుతుందని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. 'షీ టాక్స్' కార్యక్రమంలో భాగంగా బాలంరాయిలో స్థానిక యువతులతో ప్రత్యేకంగా భేటీ అయ్యి వివిధ అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళా సాధికారత, ఉపాధి కల్పనలకు ప్రభుత్వం తరపున చేపట్టాల్సిన చర్యలపై అడిగి తెలుసుకున్నారు. స్వయం ఉపాధి రంగాలతో పాటు కార్పొరేట్ రంగంలోనూ మహిళలు రాణించాలని ఆకాంక్షించారు. స్థానిక బస్తీ ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా ఉందని మహిళలు ఆయన దృష్టికి తీసుకురాగా విద్యుత్ అధికారులతో మాట్లాడి తక్షణమే కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఖిల సరిత శైలజ మౌనిక రవళి రాధిక వరలక్ష్మి మాధవి సౌజన్య కీర్తన అప్పు పాల్గొన్నారు.



## బీజేపీకి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న కొమ్ము శేఖర్ మాదిగ

లాలాపేట: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మాదిగలంతా తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ అన్నారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ఈ పార్లమెంట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని ఆగస్టు రెండో వారంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో జరిగే ఈ బహిరంగ సభకు మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన విద్యార్థులంతా తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో మహేశ్, అజయ్‌మాదిగ, ఆదిత్య, పరశురామ్ మాదిగ, ప్రవీణ్, హరి, శ్రీకాంత్, రాజు, వినయ్, సురేష్, శ్రవణ్ పాల్గొన్నారు.

## టైప్ రైటింగ్ పరీక్షలను సకాలంలో నిర్వహించాలి



శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

లాలాపేట: రాష్ట్ర వ్యాప్తంగా టైప్ రైటింగ్ పరీక్షలను సకాలంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ రీజినల్ డైరెక్టర్‌గా ఇటీవల నూతనంగా వచ్చిన డా. సి. శ్రీనాథ్, సెక్రటరీ పుల్లయ్యను వారి కార్యాలయంలో అసోసియేషన్ సన్మానించారు. కంప్యూటర్ బేస్ట్ టైప్ రైటింగ్ పరీక్షలను కేవలం టైపు రైటింగ్ ఇనిస్టిట్యూట్‌లకు మాత్రమే అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ మసూద్ అలీ, అధ్యక్షులు సాగర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



### కరాటేలో సత్తా

అమీర్‌పేట: నాయక్ బుదోఖాన్ కరాటే అకాడమీ విద్యాంజలి ఆధ్వర్యంలో అమీర్‌పేట్‌లో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. నాయక్ బుదోఖాన్ కరాటే అకాడమీ అధ్యక్షుడు మాస్టర్ పి.గణేష్ విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేశారు. క్రమశిక్షణ, ఏకాగ్రతతో సాధన చేస్తే కరాటేలో రాణించవచ్చన్నారు. మాస్టర్లు వాసుదేవ్ పాల్గొన్నారు.